క్లుప్తంగా

కేటీఆర్‌కు ఘన స్వాగతం

తుక్కుగూడ: బీఆర్‌ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఆ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం అచ్చంపేట నియోజకవర్గంలో నిర్వహించిన సమావేశానికి వెళ్తున్న క్రమంలో తుక్కుగూడ ఔటర్ రింగు రోడ్డు వద్ద ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ తుక్కుగూడ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్, మాజీ కౌన్సిలర్లు రవినాయక్, సప్పిడి లావణ్య, నాయకులు శ్యామేల్ రాజు, వెంకట రాజిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ వీక్షణ



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ శ్రేణులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి సుల్తాన్‌పూర్‌లో ఆదివారం గ్రామస్తులతో కలిసి రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ప్రధాని మోదీ జాతినుద్దేశించి ప్రసంగించారు. విప్లవకారుడు భగత్‌సింగ్, దిగ్గజ గాయని లతా మంగేష్కర్ జయంతీల సందర్భంగా వారిని స్మరించుకున్నారు. అక్టోబర్ 2 నుంచి దేశ ప్రజలందరూ ఖాదీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితే కాని పట్టదా!



లారికి తాకుతున్న విద్యుత్ తీగలు

బడంగ్‌పేట్: రహదారిపై వాహనానికి తాకే ఎత్తులో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. నాదర్‌గుల్ బాలాజీ బెకరీ పైనుంచి విద్యుత్ లైన్ ఉంది. అయితే వైర్లు వాహనాలకు తగులుతుండటంతో చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరగముందే తీగలను సరిచేయాలని ట్రాన్స్‌కో అధికారులను కోరుతున్నారు.

డిప్యూటీ కలెక్టర్‌గా అనూషారెడ్డి



అనూషను సన్మానిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న అనూషారెడ్డి గ్రూప్–1లో ర్యాంక్ సాధించి, సూర్యాపేట జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఏబీసీసీ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి.. హయత్‌నగర్‌లోని ఆమె నివాసంలో కలిసి, సన్మానించి అభినందనలు తెలిపారు.

అన్న'దాత'కు సన్మానం



కృష్ణారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న కమిటీ సభ్యులు

పహాడీషరీఫ్: మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా వారం రోజులు భక్తులకు అన్నదానం చేసిన వైష్ణోయ్ గ్రూప్ డైరెక్టర్ ఎడ్ల కృష్ణారెడ్డిని ఆదివారం ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. పండిత ఆశీర్వచనం చేసింది. కమిటీ చైర్మన్ క్లెం నరేష్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లాల్ సతీష్ గౌడ్ తదితరులు దాతకు.. స్వామి వారి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ బండారి గోపాల్ యాదవ్, గుర్జని గణేశ్ గౌడ్ పాల్గొన్నారు.

మదర్సాలో ప్రత్యేక ప్రార్థనలు

ఆమనగల్లు: చింతలపల్లి జామియా నిజాం మియా మదీనాతుల్ మదర్సాలో ఆదివారం ఖాతమి ఖురాన్ నిర్వహించారు. మదర్సా చైర్మన్ ఖామరుద్దీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, దువ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మదర్సా నిర్వాహకులను ఘనంగా సత్కరించారు.



హుడాకాంప్లెక్స్: హుడాకాలనీ అమ్మవారి సన్నిధిలో మాజీ మంత్రి హరీశ్‌రావు పూజలు



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో మహాచండిదేవిగా..



తుక్కుగూడ: మహాచండిగా రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ

నేత్రపర్వంగా నవరాత్రోత్సవాలు

దేవీ నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఏడో రోజు ఆదివారం అమ్మవారు మహాచండిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా దేవతామూర్తికి నిర్వాహకులు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ విశేషపూజలు, హోమం, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

–సాక్షి, నెట్‌వర్క్



మహేశ్వరం: రాజరాజేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బడంగ్‌పేట్: జయశంకర్ కాలనీ దుర్గామాత సన్నిధిలో నాయకులు



పహాడీషరీఫ్: అమ్మవారి సన్నిధిలో అన్నదానం

సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి



మాతా కీ జాగరణ్‌లో పాల్గొన్న ఎంపీ లక్ష్మణ్

సైదాబాద్: నేటి యువత ఆధ్యాత్మిత వైపు మొగ్గు చూపడం అభినందనీయమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీ శ్రీవిజయ వినాయక దేవాలయం ప్రాంగణంలో ధర్మ రక్ష ఫౌండర్, బీజేపీ సీనియర్ నాయకుడు చీకోటి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాతా కీ జాగరణ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలన్నారు. ప్రతీ ఏడాది దేవీ నవరాత్రుల సందర్భంగా భక్తుల కోసం ఐఎస్‌సదన్‌లో చీకోటి ప్రవీణ్ కుమార్ మాతా కీ జాగరణ్ నిర్వహించడం ఆనందాన్ని కలిగిస్తుందన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



పూజలో పాల్గొన్న భక్తులు

వనస్థలిపురం: వనస్థలిపురం సచివాలయనగర్‌లోని శ్రీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం సువర్ణ పుష్పార్చన, ఉత్సవ మూర్తులకు అభిషేకం, సుదర్శన హోమం, అష్టదళ పాద పద్మార్చన, శ్రీవారి కల్యాణ మహోత్సవం, యాగశాలలో విశేష హోమాలు, తిరువీధి ఉత్సవం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి శ్రీధర్, సంయుక్త కోశాధికారి రామలక్ష్మి పాల్గొన్నారు.

- వనస్థలిపురం చింతలకుంట జనప్రియహోమ్స్ కాలనీలోని గోదా పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆరు రోజుల పాటు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అభిషేకాలు, స్వస్తివాచనం, అంకురార్పణ తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ పీవీ.నర్సింహారావు, కార్యదర్శి మహేష్ బాబు పాల్గొన్నారు.

మూసీ పరీవాహక ప్రాంతాల్లో అధికారుల పర్యటన



రోడ్లు పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మలక్‌పేట: జీహెచ్‌ఎంసీ సౌత్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి, ఆరోగ్యం, పారిశుద్ధ్య విభాగం అదనపు కమిషనర్ సీఎస్ రఘుప్రసాద్ ఆదివారం మలక్‌పేట మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించారు. మూసారంబాగ్ బ్రిడ్జి, రోడ్ల మరమ్మతులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వరద బాధితులకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ఇళ్లలో పేరుకుపోయిన బురదను హైడ్రా, పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారన్నారు. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించామన్నారు. ఆయన వెం మలక్‌పేట డీసీ ఎంకేఐ అలీ, జాయింట్ కమిషనర్ శంకర్ ఉన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీని స్ఫూర్తిగా తీసుకోవాలి



కొండా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నర్సింగ్‌రావు

నాగోలు: నిజాం వ్యతిరేక ఉద్యమాలలో పాల్గొని నిజాం గుండెల్లో భయాన్ని సృష్టించిన వీర యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని మన ఆలోచన సాధన సమితి(మాస్) వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు అన్నారు. ఆచార్య ఆదివారం మన ఆలోచన సాధన సమితి (మాస్) ప్రధాన కార్యాలయంలో దుడుకు గోవర్ధన్ అధ్యక్షతన నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో నర్సింగ్ రావు పాల్గొని మాట్లాడారు. చేనేత పద్మశాలి కులలే కాక బలహీన వర్గాల అభ్యున్నతికి కొండా లక్ష్మణ్ బాపూజీ నిరంతరం కృషి చేశారన్నారు. 96 సంవత్సరాల వయసులోనూ తీవ్ర చలిని లెక్క చేయకుండా ఢిల్లీలో తెలంగాణ కోసం దీక్ష చేశాడని అలాంటి ఆదర్శ ఉద్యమకారుడిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఓయూ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీరామదాసు రామచంద్రం మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం ఆదర్శమన్నారు. కార్యక్రమంలో నరసింహగౌడ్, ఆనందం, నరసింహ, దేవేందర్‌జీ, యాదగిరి, బురం శంకర్, యాదగిరి, తిరందాసు యాదగిరి, వెంకటస్వామి గౌడ్, అమృతం మార్కండేయ, కోమటి సత్యనారాయణ, కత్తుల సుదర్శన్, మిరియాల శేషయ్య, గోవర్ధన్, సత్యనారాయణ ఉన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

ఎల్‌బీనగర్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యవక్తగా శ్రీరేణుకా రాజరాజేశ్వరి శక్తిపీఠం మొల్లూరి నవీన్‌శర్మ, లక్ష్మీ నారాయణ పాల్గొని సంఘం ఆవశ్యకత, సేవా కార్యక్రమాల ప్రాధాన్యంపై అభిప్రాయాలను వ్యక్త పరిచారు. సమాజాభివృద్ధికి ఇలాంటి ఉత్సవాలు ప్రేరణ కలిగిస్తాయని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



రాంచంద్రరావును కలిసిన కమలనాథులు

నాగోలు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు అధ్యక్షతన, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్, సీనియర్ నాయకులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పర్యవేక్షణలో ఆదివారం కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్ రాంచంద్రరావుకు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

డివిజన్ అభివృద్ధికి చర్యలు



లచ్చిరెడ్డిని సత్కరిస్తున్న కాలనీవాసులు

ఎల్‌బీనగర్: డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాలనీవాసులు కార్పొరేటర్ లచ్చిరెడ్డికి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.

విగ్రహ ఏర్పాటు అనుమతికి వినతి

తుర్కయంజాల్: పురపాలక సంఘం ఇంజాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటుకు దేవాదయ శాఖ నుంచి అనుమతి ఇప్పించాలని గ్రామస్తులు కోరారు. ఆదివారం స్థానిక నాయకుడు బొక్క భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేరు ప్రఖ్యాతులు గాంచిన దేవాలయం అభివృద్ధికి సహకరించాలన్నారు. ఎమ్మెల్యే దీనికి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే పర్మిషన్ ఇప్పిస్తానని చెప్పినట్లు పేర్కొన్నారు. నాయకులు ధన్‌రాజ్ గౌడ్ ఉన్నారు.

విప్లవ వీరుడు భగత్‌సింగ్

యువత ఆదర్శంగా తీసుకోవాలి: వక్తలు

హుడాకాంప్లెక్స్: విప్లవ వీరుడు భగత్‌సింగ్ అని, ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు బాతరాజు నర్సింహ అన్నారు. ఆదివారం సరూర్‌నగర్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నర్సింహ మాట్లాడుతూ.. 12 ఏళ్ల చిన్న వయసులోనే భగత్‌సింగ్ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, 23 ఏళ్ల ప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.గోపాల్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జిల్లాల కృష్ణ, ఎండీ.మహబూబ్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి పాల్గొన్నారు.

దేశం కోసం ప్రాణత్యాగం..

పహాడీషరీఫ్: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన షహీద్ భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని మాజీ కార్పొరేటర్లు సుక్క శివకుమార్, యాతం పవన్‌కుమార్ యాదవ్‌లు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు జయంతి సందర్భంగా మామిడిపల్లిలో భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం భగత్‌సింగ్ స్మారకార్థం కార్యక్రమాన్ని చేపట్టారు. అంతకు ముందు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎల్.కె.కృష్ణ, మహ్మద్ నయీం, కోట్ల రంగనాథ్, గుజ్జుల పద్మారావు, లిక్కి విశ్వనాథ్ రెడ్డి, వీరేష్ యాదవ్, ఆదిల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పహాడీషరీఫ్: రక్తదానం చేస్తున్న యువకులు

కష్టపడి.. కొలువు సాధించి

షాద్‌నగర్ యువతికి డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం



తల్లిదండ్రులతో అనుమిత్ర

షాద్‌నగర్: పట్టువదలకుండా చదివింది.. తల్లిదండ్రుల కలలను నెరవేరుస్తూ.. అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. తాజాగా వెలువడిన గ్రూప్–1 పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఆమెనే షాద్‌నగర్ పట్టణానికి చెందిన అనుమిత్ర. ఆమె పట్టణానికి చెందిన న్యాయవాది అందరి అంజయ్య, భాగ్యమ్మల కూతురు. ఇటీవల ప్రకటించిన గ్రూప్–1 ఫలితాల్లో ఆమె ప్రతిభ చాటింది. డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం సాధించింది. శనివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఆమె తల్లి భాగ్యమ్మ పట్టణంలోని పద్మావతికాలనీలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తుంది. వీరికి ఇద్దరు సంతానం.

పట్టువదలకుండా..

అనుమిత్ర ప్రాథమిక విద్యభ్యాసాన్ని స్థానికంగా ప్రైవేట్ పాఠశాలలో కొనసాగించింది. అనంతరం హైదరాబాద్‌లోని మదీనగూడలో ఓ ఐఏఎస్ అకాడమీలో ఇంటర్ ఎంఈసీ, అనంతరం అదే కళాశాలలో డిగ్రీ హెచ్‌పీజీ చదివారు. అనంతరం సివిల్‌లో శిక్షణ పొందారు. రెండుసార్లు సివిల్స్ పరీక్షలు రాసి ఇంటర్వ్యూ వరకు వెళ్లిన ఆమెకు నిరాశ ఎదురైంది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో గ్రూప్–1 పరీక్షలను రాసి మంచి ఫలితాలు సాధించారు. ప్రభుత్వం ఆమెకు మహబూబ్‌నగర్ డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిదని, విధి నిర్వహణలో అన్ని సమస్యలను పరిష్కరిస్తానని అనుమిత్ర పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

నందిగామ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అదనపు తరగతి గదుల నిర్మాణం, పారిశ్రామిక వాడలో పాత జాతీయ రహదారిపై ఏర్పాటు చేయనున్న సెంట్రల్ లైటింగ్ పనులకు ఎమ్మెల్యే శంకర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. గ్రామాలను సైతం అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణం, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలలో అదనపు తరగతి గదులు, బీటీ రోడ్లు తదితర పనులను చేపట్టినట్లు వివరించారు. రూ.5 కోట్ల వ్యయంతో కొత్తూరు నుంచి షాద్‌నగర్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.2 కోట్ల 20 లక్షల వ్యయంతో నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 అదనపు తరగతి గదులు, టాయిలెట్ల బ్లాక్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, నాయకులు చంద్రపాల్‌రెడ్డి, కృష్ణ, కుమార్‌గౌడ్, కృష్ణ, నర్సింహ, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాపోలు భాస్కరరావు

చంపాపేట: కండరాల క్షీణత వ్యాధితో మంచానికే పరిమితమై ఇతరులపై ఆధారపడుతున్న వికలాంగులకు ఇతర రాష్ట్రాల్లో తరహా రూ. 15 వేలు పింఛన్ అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మస్క్యులర్ డిస్ట్రోఫీ అవగాహన దినోత్సవం సందర్భంగా చంపాపేట డివిజన్ మారుతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో కండరాల క్షీణత బాధితుల అసోసియేషన్ (టీఎండీఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఆలూరి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కండరాలు, నరాల క్షీణత వ్యాధితో బాధపడేవారికి శరీరానికి అవసరమైన శక్తిని తగ్గిస్తుందని దీంతో రోగుల నడక, శ్వాస, దైనందిన పనుల్లో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవటంతో ఇతరులపై ఆధార పడాల్సిన వస్తుందన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువులు, మెడికల్ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని అర్హత గల దివ్యాంగుడికి రూ.6 వేల పింఛన్ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అందె రాంబాబు, వినోద్ కుమార్, శివకుమార్, సతీష్‌చంద్ర, రమేష్‌యాదవ్, శ్రీనివాస్, కిరణ్ పాల్గొన్నారు.

దేశ నిర్మాణమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం



విజయదశమి వేడుకలో ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యులు

ఆమనగల్లు: వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ ధర్మజాగరణ ప్రముఖ్ లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో ఆదివారం సంఘ వందేళ్ల స్థాపన ఉత్సవాల్లో భాగంగా విజయదశమి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1925లో ప్రారంభమైన ఆర్‌ఎస్‌ఎస్.. దేశవ్యాప్తంగా విస్తృతశాఖలతో విభిన్న రంగాలలో దేశభక్తిపూరిత హిందుత్వ ఆధార సంస్థలతో పనిచేస్తుందని తెలిపారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇంటింటి జనజాగరణ చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు ఆచారి, సభ్యులు బిచ్యానాయక్, అంజయ్య, ఆనంద్, విశ్వనాథం, తిరుపతయ్య, మనోహర్, భాస్కరచారి, మధు, నర్సింహ పాల్గొన్నారు.